


పాలకొండ: ప్రత్యేక అలంకరణలో మరకత లింగం

శంభో శంకర

- భక్తిశ్రద్ధలతో శివరాత్రి పూజలు
- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- మార్మోగిన శివ నామస్మరణ



పారమ్మతల్లి దర్శనం కోసం పారమ్మ కొండ ఎక్కుతున్న భక్తులు

(పాలకొండ/సీతంపేట/గరుగుబిల్లి/భామిని/సీతానగరం)

మహాశివరాత్రి సందర్భంగా శుక్రవారం జిల్లాలో శివ నామస్మరణ మార్మోగింది. శైవక్షేత్రాలు, గుహాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునే నదీ స్నానాలు ఆచరించి .. శివాలయాలకు చేరుకున్న భక్తజనం గంటల కొద్దీ క్యూలైన్లలో నిరీక్షించారు. అనంతరం ముక్కంటిని దర్శించుకుని పులకించిపోయారు. ఉపవాసాలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శంభో శంకర.. కరుణించు అంటూ వేడుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, కురుపాం, పాలకొండతో పాటు 15 మండలాల్లోని శివాలయాల్లోనూ భక్తుల రద్దీ కనిపించింది. కొన్నిచోట్ల భక్తజనం తలనీలాలు సమర్పించి.. మొక్కులు తీర్చుకున్నారు. ఇంకొన్నిచోట్ల కన్నుల పండువగా శివ పార్వతుల కల్యాణం నిర్వహించారు మొత్తంగా అంతటా ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.

గుంపలో..

కొమరాడ: నాగావళి, జంఝావతి నదుల సంగమంలో వెలసిన గుంప సోమేశ్వర ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గుంపలో శుక్ర, శనివారాలు జాతర జరగనుండగా.. జాగారాలు చేసే భక్తుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పార్వతీపురం డిపో నుంచి ఆర్టీసీ బస్సులను వేశారు. డీఎస్పీ ఆధ్వర్యంలో ఎస్‌ఐ నీలకంఠం, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

పారమ్మకొండకు పోటెత్తిన భక్తులు

సాలూరు రూరల్: పారమ్మకొండపై వెలసిన పారమ్మతల్లి జాతరకు శుక్రవారం భక్తులు పోటెత్తారు. ఏపీ, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి వేలాదిగా భక్తజనం తరలివచ్చారు. ఉత్సహంగా కొండపై వరకు ఎక్కి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు , అభిషేకాలు చేశారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్, ఉపముఖ్యమంత్రి రాజన్నదొర దంపతులు పారమ్మకొండకు వచ్చి పూజలు చేశారు. సనాతన ధర్మపరిషత్ ఆధ్వర్యంలో పాండవుల గుహ వద్ద కోటి గణపతినామాల స్థూప స్థాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. జాతరలో వివిధ సేవా సంస్థలు పోటాపోటీగా భక్తులకు సేవలందించాయి. కొండ శిఖరాన ఉన్న అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు అడుగడుగునా ఉసిరికాయలు, మజ్జిగ, తాగునీరు అందించారు. మరికొందరు అన్నం, దద్దోజనం, పులిహోర, కర్బూజ తదితర ఆహార పదార్థాలను పంపిణీ చేశారు. సాలూరు రూరల్ సీఐ బాలకృష్ణ, పాచిపెంట ఎస్‌ఐ పొదిలాపు నారాయణరావు ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత భద్రత ఏర్పాట్లు చేశారు. వైద్య శిబిరం నిర్వహించారు. సాలూరు ఆర్టీసీ డిపో నుంచి పారమ్మకొండకు 25 బస్సులను నడిపారు. ఆటోలు, ద్విచక్ర వాహనాలతో భారీ సంఖ్యలో భక్తులు తరలిరావడంతో పారమ్మకొండ భక్తజనంతో నిండుగా కనిపించింది.

గుమ్మలకొండ గుహాలయం వద్ద

సాలూరు మండలం గుమ్మలకొండ గుహాలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కొండపైకి ఎక్కి శివదర్శనం చేసుకున్నారు. మామిడిపల్లి, సాలూరు, పడాలవలస, మరిపిల్లి, కాకుడువలస, అంటివలస, అన్నంరాజు వలస తదితర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ వారికి తాగునీరు, ప్రసాద ఏర్పాట్లు చేసింది. జాగరణకు వీలుగా కార్యక్రమాలను నిర్వహించారు.

మంచాడవలస గుహాలయంలో..

మంచాడవలస వద్ద గోకర్ణేశ్వర స్వామి గుహాలయానికి కూడా భక్తులు పోటెత్తారు. ఇరుకైన గుహలోకి వెళ్లి స్వామి దర్శనం చేసుకున్నారు. ఇక్కడ శివదర్శనం చేసుకుంటే కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. దీంతో కొందరు తలనీలాలను సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జాగరణ చేసే భక్తులు, జాతరకు వచ్చిన వారికి ఉత్సవ కమిటీ పులిహోర, తాగునీరు, మజ్జిగను అందించింది. భజన కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశారు. అనంతరం గుహాలయం వద్ద శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. పాచిపెంట పోలీసులు భద్రత చర్యలు తీసుకున్నారు.



కొమరాడ: గుంప సోమేశ్వర ఆలయానికి వెళ్తున్న భక్తులు



సీతంపేట: కాశీ విశ్వేశ్వరాలయం వద్ద...



గరుగుబిల్లి: జీవీ పురంలో శివపార్వతుల కల్యాణం చేస్తున్న దృశ్యం



పాలకొండలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ఇలా..



సాలూరు పంచముఖేశ్వర స్వామి ఆలయంలో..




సీతానగరం: బలిజిపేట మండలం నారాయణపురంలో..



భామిని: ఎండల మల్లికార్జునస్వామి ఆలయం వద్ద..



మక్కువ మండలం ములక్కాయవలసలో ..



సాలూరు రూరల్: మంచాడవలస గుహాలయంలో..



ఎమ్మెల్యే చేతుల మీదుగా నగదు, చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

ఎన్నికల వేళ.. తాయిలాలు

- మహిళలకు నగదు, చీరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న ప్రజలను వైసీపీ నేతలు మచ్చిక చేసుకునే పనిలో పడ్డారు. ఎన్నికల వేళ ఓటర్లకు వివిధ తాయిలాలతో ఎర వేస్తున్నారు. మరి కొద్దిరోజుల్లో ఎన్నికల కోడ్‌ను ప్రకటించే అవకాశం ఉండడంతో వైసీపీ నాయకులు జోరుగా వస్తు, ధన రూపంలో తాయిలాలు అందిస్తున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఓ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే జోగారావు తాయిలాల పంపిణీకి తెరతీశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మహిళలందరికీ చీరతో పాటు రూ.500 చొప్పున నగదు పంపిణీ చేశారు. దీన్ని చూసి ఎన్నికల మహత్యం అని అక్కడున్న వారు చర్చించుకోవడం కనిపించింది.

రాయితీ పథకాలకు దరఖాస్తులు

గరుగుబిల్లి, మార్చి 8 : ఉద్యాన పంటలకు సంబంధించి అవసరమైన రాయితీ పథకాల కోసం గ్రామాల్లోని రైతులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి కేఎస్ఎస్ రెడ్డి కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఎకరా పొలం దాటిన వారు స్ప్రింక్లర్ల సెట్, నలుపు పైపుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇందుకోసం ఈ నెల 12లోగా ఆర్‌బీకేల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. 2.5 ఇంచీల 30 పైపులకు రూ. 12,335, మూడు ఇంచీల పైపులకు రూ. 17,500 రైతుల వాటాగా చెల్లించాలన్నారు. సామగ్రి కావలసిన వారు 91103 37056, 79950 09841, 79950 09843 నెంబర్లకు సంప్రదించాలన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ ప్రకటన తర్వాత మంజూరులో ఆలస్యం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని సంబంధిత రైతుభరోసా కేంద్రాల సిబ్బంది రైతులకు తెలియజేయాలని చెప్పారు.

రెగ్యులరైజేషన్ కొందరికేనా?



సీతంపేట: సీతంపేట ఐటీడీఏ పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఒప్పంద ఉపాధ్యాయులను రెగ్యులరైజేషన్ చేశారు. ఈ మేరకు శుక్రవారం గిరిజన సంక్షేమ శాఖ డీడీ అన్నదొర ఉత్వర్వులను అందించారు. అయితే కొందరికే చాన్స్ దక్కడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవంగా ఐటీడీఏ పరిధిలోని వివిధ ఆశ్రమ పాఠశాలల్లో 254 మంది కాంట్రాక్ట్ ఒప్పంద ఉపాధ్యా యులుగా పనిచేస్తున్నారు. అయితే వీరిలో 2014 ముందు విధుల్లో చేరి.. అన్ని అర్హతలు సాధించిన వారికి రెగ్యులరైజేషన్ చేయడానికి ప్రభుత్వం నిబంధనలు విధించింది. కాగా ఐటీడీఏ పరిధిలో 44 మందికి అన్ని అర్హతలు ఉన్నా.. 29 మందికి రెగ్యులర్ చేస్తూ వాటి జాబితాను జిల్లా గిరిజన సంక్షేమశాఖ కార్యాలయానికి పంపించారు. మిగిలిన 15 మంది సీఆర్‌టీలు మాత్రం.. తమకు ఎప్పుడు అవకాశం వస్తుందోనని ఆశగా ఎదురు చూస్తున్నారు.

'మన్యం'లో అకాల వర్షం

సీతంపేట/గుమ్మలక్ష్మీపురం/భామిని/బెలగాం: ఏజెన్సీలో శుక్రవారం భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. జిల్లాలోని సీతంపేట, గుమ్మలక్ష్మీపురం తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం వరకు ఎండ వేడి అధికంగానే ఉంది. అయితే సాయంత్రానికి ఆకాశం పూర్తిగా మేఘావృతమైంది. మెల్లగా చల్లగాలులు వీయగా.. ఉన్నట్టుండి వర్షం కురిసింది. సుమారు గంట పాటు వాన పడడంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. భామిని మండలం, పార్వతీపురం పట్టణం, రూరల్‌లోనూ రాత్రి 9 గంటల నుంచి అర గంట పాటు ఓ మోస్తరుగా వర్షం కురిసింది. కొద్ది రోజులుగా ఎండ వేడి, ఉక్కపోతకు అల్లాడిన ఆయా ప్రాంతవాసులు ఈ వర్షంతో కాస్త ఉపశమనం చెందారు. జీడి, మామిడికి ఈ వాన మేలు చేస్తుందని ఆయా రైతులు చెబుతున్నారు. అయితే చింతపండు, కొండచీపుర్లుకు మాత్రం నష్టం తప్పదని ఆయా ప్రాంత వాసులు వాపోతున్నారు.



భామినిలో వర్షం కురుస్తున్న దృశ్యం

నెలనెలా.. ఏదీ వెన్నెల?

- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిష్ఠాత్మకంగా అమలు
- ఏటా క్యాలెండర్ ఆవిష్కరణ
- గిరిజన విద్యార్థులకు ఎంతో మేలు
- విద్యా విజ్ఞాన వికాసానికి దోహదం
- అధికారంలోకి రాగానే మంగళం పాడేసిన వైసీపీ సర్కారు
- మండిపడుతున్న గిరిజన సంఘాలు

(సీతంపేట)

'గిరిజన విద్యార్థుల విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తున్నాం.. ఇందుకోసం భారీగా నిధులు వెచ్చిస్తున్నాం' అని చెబుతున్న వైసీపీ సర్కారు ప్రకటనలకే పరిమితమవుతోంది. ఆచరణలో చేతులెత్తేస్తుండడంతో క్షేత్రస్థాయిలో భిన్న పరిస్థితులు నెలకొంటున్నాయి. గత టీడీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా సీతంపేట ఐటీడీఏలో ప్రయోగాత్మకంగా అమలు చేసిన నెలనెలా వెన్నెల కార్యక్రమానికి వైసీపీ ప్రభుత్వం మంగళం పాడేసింది. 2020 నుంచి నిధులు సైతం కేటాయించడం లేదు. గిరిజన విద్యార్థుల విద్యా విజ్ఞాన వికాసం కోసం చేపట్టిన కార్యక్రమాన్ని అమలు చేయకపోవడంపై తల్లిదండ్రులు, గిరిజన సంఘాల నాయకులు మండిపడు తున్నారు. తక్షణమే ఈ కార్యక్రమాన్ని పునఃప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

సీతంపేట ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న గిరిజన విద్యార్థుల కోసం గత టీడీపీ ప్రభుత్వం 'నెల నెలా వెన్నెల' పేరిట ఓ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీని ప్రకారం గిరిజన విద్యార్థులకు విద్యతో పాటు సాంస్కృతిక, వినోద కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహించేవారు. విహార యాత్రలకు తీసుకెళ్లేవారు. ఇందుకోసం అప్పటి టీడీపీ ప్రభుత్వం ఐటీడీఏలకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసేది. దీనిలో భాగంగా ఏడాది పొడువునా ఈ కార్యక్రమాన్ని చేపట్టేవారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలనే ఉద్దేశంతో ప్రతినెలా క్యాలెండర్‌ను ఆవిష్కరించేది. తొలుత ఈ కార్యక్రమాన్ని సీతంపేటలో అమలు చేసినా.. కాలక్రమంలో రాష్ట్రంలోని మిగతా అన్ని ఐటీడీఏల్లో ఇదే పథకాన్ని అమలు చేశారు.

అమలు ఇలా..

'నెల నెలా వెన్నెల' కార్యక్రమం ద్వారా సీతంపేట ఐటీడీఏ పరిధిలో 47 ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న 13 వేల మంది గిరిజన విద్యార్థులకు వారానికి రెండు రోజుల పాటు చికెన్ పెట్టేవారు. అంతకముందు ఆదివారం ఒక్కరోజే చికెన్ ఇచ్చేవారు. నెలనెలా వెన్నెల కార్యక్రమం అమలు చేసిన తర్వాత ప్రతి మంగళవారం కూడా మాంసాహారం పెట్టేవారు.

- ప్రతి పాఠశాలలో టెన్త్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచే ముగ్గురు లేదా నలుగురు విద్యార్థులను ఒక క్లస్టర్‌ను ఎంపిక చేసేవారు. వారితో ఐటీడీఏ పీవో తన నివాస గృహంలో ఇష్టాగోష్ఠి విందు కార్యక్రమం నిర్వహించేవారు. అప్పుడప్పుడు కలెక్టర్ కూడా పాల్గొనేవారు. విద్యార్థులతో అనేక అంశాలపై చర్చించేవారు. ఎన్నో సందేహాలను నివృత్తి చేసి.. భవిష్యత్‌లో ఉన్నతంగా స్థిరపడేందుకు అవసరమైన సూచనలు, సలహాలు ఎన్నో ఇచ్చేవారు.
- పదో తరగతి నుంచి ఎంపిక చేసిన 80 మంది విద్యార్థులను ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన శాలిహుండాం, శ్రీహరికోట వంటి విజ్ఞాన విహారయాత్రలకు తీసుకెళ్లేవారు.కార్తీకమాసంలో వనభోజన కార్యక్రమాన్ని నిర్వహించేవారు. ఏటా 9వ తరగతి చదువుతున్న వారికి విశాఖ నగరంలోని విహార ప్రాంతాలను సందర్శించే అవకాశం కల్పించేవారు.
- గిరి ఒలింపిక్స్, గణితం, సైన్స్ ప్రాధాన్యంపై అవగాహన కల్పించేవారు. ఇందుకోసం చిత్రలేఖనం, వివిధ క్రీడాపోటీలు, సైన్స్ ఫెయిర్ నిర్వహించేవారు. విజేతలకు బహుమతులు ఇచ్చేవారు.
- తొమ్మిదో తరగతి పాసై టెన్త్‌కు చేరుకునే విద్యార్థులకు వాచ్‌లు ఇచ్చేవారు. పరీక్ష కాలంలో ఇబ్బందులు తలెత్తకుండా టైం ప్రకారం విద్యార్థులు నడుచుకునేలా వాటిని పంపిణీ చేసేవారు.
- గిరిజన సంప్రదాయ ప్రకారం ఆశ్రమ పాఠశాలల్లోనే పండగలు నిర్వహించేవారు.
- ప్రతి శనివారం తెలుగు చలనచిత్రం ప్రదర్శించేవారు.



గతంలో ఏర్పాటు చేసిన నెలనెలా వెన్నెల క్యాలెండర్

- గిరిజన విద్యార్థులు ఇంగ్లిష్, హిందీ భాషల్లో పట్టు సాధించానే ఉద్దేశంతో రెండు నెలలకు ఒకసారి ఆంగ్ల, హిందీ చిత్రాలను కకూడా ప్రదర్శ ఆశ్రమ పాఠశాలల్లో ప్రదర్శించేవారు.
- నెలలో మొదటి ఆదివారం హ్యాపీ సండే, రెండో శనివారం 2కే రన్ నిర్వహించేవారు. వారంలో మూడు రోజులు యోగా క్లాసులు చేపట్టేవారు.
- మొత్తంగా ఏ రోజు ఏ కార్యక్రమం నిర్వహించాలనే దానిపై ప్రతి ఆశ్రమ పాఠశాలలో నెలనెల వెన్నెల పేరుతో క్యాలెండర్‌ను ఆవిష్కరించేవారు. ఇవి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉండేవి.

అయితే ఇదంతా గతం. ప్రస్తుతం సీతంపేట ఐటీడీఏ పరిధిలో నెలనెల వెన్నెల కార్యక్రమం ఎక్కడా అమలు కావడం లేదు. వైసీపీ సర్కారు ఈ పథకాన్ని పూర్తిగా అటకెక్కించింది. దీంతో నాలుగున్నరేళ్లుగా గిరిజన విద్యార్థులు విద్య, విజ్ఞాన, వికాస కార్యక్రమాలకు నోచుకోవడం లేదు. ఐటీడీఏ పరిధిలో ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న వారికి ఎంతో మేలు చేసే ఈ కార్యక్రమాన్ని అమలు చేయకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయంపై జిల్లా గిరిజన సంక్షేమశాఖ డీడీ అన్నదొరను వివరణ కోరగా.. తాను బాధ్యతలు చేపట్టి మూడు నెలలే అయ్యిందన్నారు. గతంలో ఈ పథకం నిర్వహించిన సంగతి తనకు తెలియదన్నారు.



విహార యాత్రలో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన టెన్త్ గిరిజన విద్యార్థులను ఆగ్రాకు తీసుకెళ్లిన దృశ్యం (ఫైల్)

జామిలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

జామి: జామి శివాలయం వద్ద శుక్రవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి విజయ్ 79 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందించారు. బీపీ, డయాబెటిస్, చర్మ వ్యాధులు, దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించారు.



వైద్య సేవలు అందిస్తున్న దృశ్యం

రేగిడి మండలంలో..

రేగిడి: సంకిలి, ఖండ్యాంలోని ఆయుర్వేద డిస్పెన్సరీల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. సంకిలిలో డాక్టర్ మోహనరావు, ఖండ్యాంలో డాక్టర్ సునీల్ వైద్య సేవలు అందించారు. దాదాపు 200 మందికి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాల్లో స్థానిక యోగా టీచర్లు నాగరాజు, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.



సంకిలిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్, సిబ్బంది

దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్: రాజాం, గజపతినగరం కస్తుర్బల్లో ఫిజియోథెరపిస్టులుగా పని చేయడానికి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి, ఎక్స్ -అఫీషియో ఏపీసీ ప్రేమకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంటర్మీడియట్‌తో పాటు బీపీటీ, ఎంపిటీ అర్హత గల అభ్యర్థులు ఈనెల 9, 10 తేదీల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నిత్యావసరాల పంపిణీ

విజయనగరం రూరల్: కణపాక ఆగురు వీధిలోని మారుతీ స్వయం సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం 100 మంది నిరుపేదలకు 5 కిలోల చొప్పున బియ్యం, ఇతర నిత్యావసరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు గుత్తూరు చంద్రశేఖర్, నాగుమల్లి లోకనాథం, గణపతిరావు, ఆదారి వెంకటేశ్వరరావు, చంద్రశేఖరరావు, నాగరాజు, అరసాడ అప్పలస్వామి, తులసీరాం, బుదరాయవలస వెంకటరావు, చెలుమూరి రామ్మోహనరావు పాల్గొన్నారు.



తాగునీటిని పరిశీలిస్తున్న కమిషనర్

కమిషనర్ పర్యటన

రాజాం: పురపాలక సంఘ పరిధిలోని తెలగ వీధి సత్యనారాయణపురం కాలనీలో కమిషనర్ జె.నారా అప్పలనాయుడు సిబ్బందితో కలసి శుక్రవారం పర్యటించారు. కాలనీలో తాగునీటి ఇబ్బందులు, రహదారులు, కాలువల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేస్తున్నారా లేదా అని అడిగి తెలుచుకున్నారు. తాగునీటి సరఫరా విషయంలో ఇబ్బందులు ఏర్పడితే తన దృష్టికి తీసుకు రావాలని కమిషనర్ సూచించారు. కాలనీలో రహదారుల నిర్మాణానికి అంచనాలు తయారు చేయాలని ఏఈ భాగ్యలక్ష్మిని ఆదేశించారు. వీరితో పాటు కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

రిటైర్డ్ హెచ్ఎం రాములు మృతి

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలోని శివాలయం వీధికి చెందిన పొట్టి శ్రీరాములు మున్సిపల్ హైస్కూలు రిటైర్డ్ హెచ్ఎం డోకల రాములు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతికి తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు, విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల సంఘ నేత రౌతు రామ్మూర్తి, సీపీఎం పట్టణ కమిటీ తరపున పి.శంకరరావు, ఏపీటీఎఫ్ నాయకులు బంకురు జోగినాయుడు, జేసీ రాజు తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.



రాములు (ఫైల్)



సమావేశంలో మాట్లాడుతున్న చోడి ఆదినారాయణ తదితరులు

బీసీ డిక్లరేషన్‌పై హర్షం

విజయనగరం దాసన్నపేట: టీడీపీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌పై ప్రజా సంఘాల జేఏసీ హర్షం వ్యక్తం చేసిందని శెట్టి బలిజ యాత సంఘ అధ్యక్షుడు చోడి ఆదినారాయణ అన్నారు. శుక్రవారం కోట సమీపంలోని గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ-జనసేన సంయుక్తంగా బీసీల అభివృద్ధి కోసం అడుగులు వేయడం మంచి పరిణామమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు దిమిలి పైడిరాజు, మరిశర్ల చిట్టితల్లి, కిల్లంపల్లి ఆచారి, బేపల బంగారాజు, వంగలపూడి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జొన్నగుడ్డిలో 'జయహో ఎస్సీ'

విజయనగరం రూరల్: విజయనగరం నియోజకవర్గ పరిధిలోని 27వ డివిజన్ జొన్నగుడ్డిలో టీడీపీ దళిత విభాగం నాయకులు శుక్రవారం 'జయహో ఎస్సీ' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఐదేళ్ల కాలంలో ఈ ప్రభుత్వం అనుసరించిన దళిత వ్యతిరేక విధానాలు, దాడులు, హత్యలు తదితర వాటిని వివరించారు. టీడీపీ హయాంలో దళితుల సంక్షేమానికి చేసిన కృషిని గుర్తు చేశారు. 2024లో టీడీపీ అధికారంలోకి వస్తే, దళిత, గిరిజనుల కోసం చేపట్టనున్న కార్యక్రమాలను వివరించారు. టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు మామిడి రవిశంకర్, కందువా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

మహిళల కోసం 'కలలకు రెక్కలు'

● టీడీపీ కొత్త పథకం

విజయనగరం రూరల్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని టీడీపీ రాష్ట్ర శాఖ కొత్త పథకాన్ని ప్రకటించింది. 'కలలకు రెక్కలు' పేరుతో చేపట్టే పథకానికి సంబంధించిన కరపత్రాన్ని నియోజవర్గ అభ్యర్థి అదితి గజపతిరాజు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని శుక్రవారం విడుదల చేశారు. మహిళలకు విద్య, వృత్తి, వ్యాపారం, ఉపాధికి సంబంధించి ఈ పథకం ద్వారా మేలు జరుగుతుందని అదితి చెప్పారు.

మహిళలకు మేలు..

శృంగవరపుకోట: మహిళా సాధికారత కోసం టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు 'కలలకు రెక్కలు' అనే సరికొత్త పథకాన్ని ప్రవేశపెట్టినట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక అన్న క్యాంటీన్ వద్ద విలేకరులతో మాట్లాడారు. జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌తో కలిసి తీసుకొచ్చిన ఈ పథకం ద్వారా మహిళలకు వృత్తి పరమైన విద్యను అందిస్తారన్నారు. ఇంటర్‌మీడియట్ పూర్తి చేసిన మహిళలు దీని కోసం దరఖాస్తు చేసుకోనేందుకు అర్హులన్నారు. దీని కింద తీసుకునే రుణాలకు రెండు పార్టీలు బాధ్యత వహిస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీశెట్టి అరుణ, గన్ను బంగారమ్మ, పొలిమేర కనక మహాలక్ష్మి, బొనంగి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే మహిళల సంక్షేమం..

రాజాం: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు తోనే మహిళా సాధికారికత, సంక్షేమం సాధ్యమని విజయనగరం పార్లమెంటరీ మహిళా అధ్యక్షురాలు మంతిన ఉషారాణి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు లచ్చుభక్త ధనలక్ష్మి అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో మహిళా దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వారు మాట్లాడారు. 'కలలకు రెక్కలు' అనే పేరుతో సరికొత్త పథకాన్ని మహిళల కోసం తీసుకు వస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉత్తరావల్లి భవాని, జ్యోతి, పద్మ, అంకమ్మ, తుమ్మి సత్యవతి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం: 'కలలకు రెక్కలు' పథకాన్ని ప్రకటిస్తున్న అదితి గజపతిరాజు, పాలవలస యశస్విని, పత్తిగిల్లి సూర్యకుమారి

'కలలకు రెక్కలు'తో భరోసా..

బొబ్బిలి: తెలుగుదేశం-జనసేన ప్రభుత్వ హయాంలో వచ్చే జూన్ నుంచి మహిళల కోసం 'కలలకు రెక్కలు' అనే పథకాన్ని ప్రారంభించనున్నట్టు పట్టణ తెలుగు మహిళ అధ్యక్షురాలు కింతలి శ్రీదేవి, పార్లమెంట్ నియోజకవర్గ తెలుగు మహిళ కార్యదర్శి వెలగాడ హైమావతి తెలిపారు. స్థానిక దర్బారు మహల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ పథకం గురించి వివరించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా సాధికారత దిశగా టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్‌లు ముందడుగు వేస్తున్నారన్నారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థినులు ఈ పథకంలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పార్టీల హామీకత్తుతో బ్యాంకు రుణాలు అందించడమే కాక, తీసుకున్న రుణమొత్తానికి వడ్డీని కూటమి ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ఆర్థిక సమస్యల కారణంగా మహిళలు తమ కలలను సాకారం చేసుకోకుండా ఉండిపోవాల్సిన అవసరం లేదని, ఈ పథకంలో చేరి దేశంలో ఎక్కడైనా వృత్తిపరమైన ఉన్నత విద్యను అభ్యసించవచ్చని తెలిపారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు రిజిస్ట్రేషన్ లింకు పొందడానికి 92612 92612 నెంబరుకు మిస్డ్ కాల్ ఇవ్వాలని, లేదా నేరుగా 'కలలకు రెక్కలు' అనే వెబ్‌సైట్‌ను పరిశీలించాలని శ్రీదేవి, హైమావతి తెలిపారు. ఈ సమావేశంలో 18వ వార్డు కౌన్సిలరు బొత్స దమయంతి, మాజీ కౌన్సిలరు బీసపు పార్వతి పాల్గొన్నారు.



ఎస్.కోట: కొత్త పథకం గురించి వివరిస్తున్న కోళ్ల లలిత కుమారి



రాజాం: మాట్లాడుతున్న ఉషారాణి, ధనలక్ష్మి తదితరులు



బొబ్బిలి: విలేకరులతో మాట్లాడుతున్న తెలుగు మహిళా నాయకులు



బొబ్బిలిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

బొబ్బిలిలో పోలీసు కవాతు

బొబ్బిలి: రానున్న ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం బొబ్బిలి పట్టణంలో పోలీసులు కవాతు నిర్వహించారు. సీఐ మలిరెడ్డి నాగేశ్వరరావు, ఏఎస్ఐ బీవీ రమణ ఆధ్వర్యంలో ఆర్‌పీఎఫ్ సిబ్బంది కవాతు నిర్వహించారు. సమస్యాత్మక గ్రామాలలో కట్టుదిట్టమైన ఏర్పాట్ల కోసం చర్యలు తీసుకున్నామని సీఐ తెలిపారు. శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారని చెప్పారు.

అగ్ని ప్రమాదంలో మహిళకు గాయాలు

జామి: రామభద్రపురం గ్రామానికి చెందిన తిలకంశెట్టి సంతోషి గురువారం రాత్రి వంట చేస్తుండగా ప్రమాదవశాత్తూ చీరకు నిప్పంటుకొని గాయాలపాలైంది. ఆమెను రక్షించే ప్రయత్నంలో భర్త గాయపడినట్లు పోలీసులు తెలిపారు. చికిత్స నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హెచ్‌సీ ఈశ్వరరావు కేసు నమోదు చేశారు.

సూపరింటెండెంట్‌గా దాసు

రాజాం: స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా కె.గోపాల్‌దాస్‌కు పదోన్నతి లభించింది. ఇంతవరకు ఆయన ఇక్కడ సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేశారు. ఆయనను వైద్యులు, సిబ్బంది అభినందించారు.

మహిళల హక్కుల కోసం పోరాటం

విజయనగరం దాసన్నపేట: మహిళల హక్కుల కోసం పోరాడుతామని జేవీవీ రాష్ట్ర కన్వీనరు నిర్మల అన్నారు. శుక్రవారం జిల్లా పరిషత్ మినిస్టీరియల్ భవనంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక మహిళల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడినట్లయిందన్నారు. భ్రూణ హత్యలు, లైంగికదాడులు రోజురోజుకీ పెరిగిపోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కరుణ, చిన్నారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నిర్మల

ప్రజా తీర్పుతో వైసీపీ ప్రభుత్వం కనుమరుగు

రాజాం: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇవ్వనున్న తీర్పుతో వైసీపీ ప్రభుత్వం కనుమరుగు కావడం ఖాయమని మాజీ మంత్రి, టీడీపీ అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. శుక్రవారం 9వ వార్డు పరిధిలోని మేదర వీధి, కంచర వీధి, మాధవ బజార్, కుమ్మరి వీధి, గంధి వీధుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కోండ్రు మురళీ మోహన్ మాట్లాడుతూ తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబునాయుడు పాలనను రాష్ట్ర ప్రజానీకం కోరుకుంటున్నారని అన్నారు. నియంత వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. చంద్రబాబు రూపకల్పన చేసిన సూపర్‌సిక్స్, బీసీ డిక్లరేషన్‌పై సంతోషం వ్యక్తమవుతోందన్నారు. అనంతరం కుమ్మరి వీధి గ్రామదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు నంది సూర్యప్రకాష్‌రావు, పొట్నా చిట్టిబాబు, టంకాల కన్నంనాయుడు, శాసపు రమేష్ కుమార్, ఉరిటి సురేంద్ర, తవుడు, బనిశెట్టి వెంకటరావు, తూతిక చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.



గ్రామదేవత పూజల్లో పాల్గొన్న కోండ్రు మురళీమోహన్

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాజాం: పొగిరి, బొద్దాం విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా ఆ రెండు సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు, పరిశ్రమలకు ఆదివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీ సీహెచ్ మాధవరావు, రూరల్ ఏఈ సురేష్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు, పరిశ్రమల యాజమాన్యాలు సహకరించాలని కోరారు.



బొబ్బిలి: న్యాయాధికారి సరోజనమ్మను సత్కరిస్తున్న దృశ్యం



బొబ్బిలి: క్రీడా పోటీల్లో పాల్గొన్న మహిళలు



జామి: ఫిట్‌నెస్ రన్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థినులు

మగువా.. నీకు వందనం

● ఘనంగా మహిళా దినోత్సవం

మహిళా దినోత్సవాన్ని జిల్లాలో ఘనంగా నిర్వహించారు. విభిన్న రంగాల్లో ఉత్తమ సేవలందించిన మహిళలను వివిధ స్వచ్ఛంద, సేవా సంస్థలు సత్కరించాయి. సమాజంలో మహిళలకు ఉన్న ప్రాముఖ్యతను చాటి చెప్పాయి. కొన్నిచోట్ల మహిళలు కేక్‌లు కట్ చేసి.. ఆటపాటలు.. సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా గడిపారు.

బొండపల్లి: పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లోనూ ముందుంటున్నారని ఎంపీపీ చల్లా చలంనాయుడు అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ కార్యాలయాల్లో ప్రతిభ కనబరుస్తున్న మహిళా ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఎంపీడీవో ఎస్.హ రిహరరావు, ఏవో డి.వెంకటరమణ, ఏపీవో బి.కృష్ణవేణి, ఏపీఎం కె.సులోచనా దేవి పాల్గొన్నారు.

ఎస్పీ దీపికకు సత్కారం..

విజయనగరం క్రైం: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జనసేన పార్టీ వీరమహిళ మాతా గాయత్రి, అంజనీ పుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు, జనసేన నాయకులు బాలు, పిడుగు సతీష్, మొదిలి శ్రీనివాసరావు, కె.రామకృష్ణలు ఎస్పీ దీపికను శుక్రవారం సత్కరించారు. ఆమె చాంబర్‌లో కలసి శుభాకాంక్షలు తెలిపారు.

బొబ్బిలిలో...

బొబ్బిలి: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం జడ్జి సరోజనమ్మను రోటరీ క్లబ్ అధ్యక్షుడు జేసీ రాజు, శ్రీనివాసన్, శంకరరావు తదితరులు సత్కరించారు. విద్యుత్ రెవెన్యూ కార్యాలయ ఉద్యోగి పీపీఏ మెర్సీరాజును ఘనంగా సత్కరించారు. బొబ్బిలి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో యూటీ ఎఫ్ నేత విజయగౌరి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళలకు వివిధ పోటీలు నిర్వహించారు.

లక్కవరపుకోటలో...

లక్కవరపుకోట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జమ్మాదేవిపేట వద్ద గల మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ యూవీకే పాత్రో తదితరులు పాల్గొన్నారు. మహిళా ఉద్యోగులను సన్మానించారు.

అన్నమరాజుపేటలో నారీశక్తి..

జామి: జామి మండలం అన్నమరాజుపేటలో శుక్రవారం మహిళా దినోత్సవం సందర్భంగా నారీ శక్తి ఫిట్‌నెస్ రన్ కార్యక్రమం నిర్వహించారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏర్పాటు చేసిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యకర్త బోని మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు సత్కారం..

రాజాం: మహిళా దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన మహిళలకు శుక్రవారం మానవత సంస్థ రాజాం శాఖ ఘనంగా సత్కరించింది. కొత్తా చంద్రావతి, లావేటి సులోచన, డాక్టర్ యడ్ల నీరజ, పొట్నా గవర్రాజు, శాసపు జయలక్ష్మి తదితరులను స్థానిక సన్‌స్కూల్‌లో మానవత చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్ కుమార్, ప్రెసిడెంట్ బీటీ అచ్యుత్‌కుమార్, డాక్టర్ పీఎల్ఎన్ రాజు తదితరులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో యు.నీలకంఠేశ్వర యాదవ్, సహాయ కార్యదర్శి పెంకి చైతన్యకుమార్, గట్టి పాపారావు, మక్క అప్పలనాయుడు, పురపాలక సంఘ కమిషనర్ జె. నారాఅప్పలనాయుడు, లావేటి రాజగోపాలనాయుడు, ఆర్‌వీజే నాయుడు తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం: ఎస్పీ దీపికను సత్కరిస్తున్న దృశ్యం

ఎస్.కోటలో...

శృంగవరపుకోట: స్థానిక ఆదిలక్ష్మి జ్యూయలరీ యాజమాన్యం నిర్వహించిన మహిళా దినోత్సవంలో శుక్రవారం జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ ఇందుకూరి సుధారాజు, మేజర్ పంచాయితీ సర్పంచ్ గనివాడ సంతోషి కుమారి, ఎంపీటీసీలు మజ్జి దేవి, వాకాడ సింహాచలం, బొడ్డేటి ఆదిలక్ష్మిలు కేక్ కట్ చేశారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మహిళా కండక్టర్‌లకు డిపో అధికారులు శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ కార్యాలయంలో ..

విజయనగరం రూరల్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శుక్రవారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విజయనగరం నియోజకవర్గ అభ్యర్థి అదితి గజపతిరాజు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలవలస యశస్విని, టీడీపీ మహిళా విభాగం నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి, (రాజకీయం), మత్స సంతోషి (క్రీడాకారిణి), కేతా వస్తిరాణి (మహిళా కండక్టర్), దివ్య దీప్తి (వైద్యురాలు), ఆచంట మణి (ఉపాధ్యాయురాలు), మన్యాల ఉమారాణి (ఒకేషనల్ ఎడ్యుకేషన్), మజ్జి పైడమ్మ (రాజకీయం), మెహర్ లత (కర్ణాటక సంగీతం), కొర్నాన రాజ్యలక్ష్మి (రాజకీయ రంగం) తదితరులను ఘనంగా సన్మానించారు.



ఎస్.కోట: కేక్ కట్ చేస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు



లక్కవరపుకోట: ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న దృశ్యం



రాజాం: మహిళలను సత్కరిస్తున్న నాయకులు

గిరిజనుల హక్కులు కాలరాస్తున్న ప్రభుత్వాలు

● ఏజెన్సీ బంద్‌కు మద్దతు ●సీపీఎం నాయకుడు కృష్ణమూర్తి



జన రక్షణ దీక్షలో పాల్గొన్న సీపీఎం నాయకులు

బెలగాం: కేంద్రంలో ప్రధాని మోడీ, రాష్ట్రంలో సీఎంజగన్ ప్రభుత్వాలు గిరిజనులకు నష్టంచేసే విధానాలు అవలంబిస్తున్నాయని, గిరిజనుల హక్కులను కాలరాస్తున్నాయని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎం.కృష్ణమూర్తి ఆరోపించారు.గిరిజనుల హక్కులను రక్షించుకోవడానికి ఆదివారం నిర్వహించే ఏజెన్సీ బంద్‌కు పూర్తి మద్దతుఉంటుందని తెలిపారు.ఈనేపథ్యంలో బంద్‌కు మద్దతుగా శుక్రవారం పార్వతీపురం కలెక్టరేట్ వద్ద ఆదివాసీల జన రక్షణ దీక్ష సీపీఎం చేపట్టింది.ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌తో గిరిజన నిరుద్యోగులకు ఉపయోగం లేదని, గిరిజనులకు ప్రత్యేకడీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. 1/70 చట్టం పక్కాగా అమలుచేయాలని, అటవీ హక్కుల చట్టం ప్రకారం గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పట్టాలివ్వాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజ నుల సంపద ఖనిజాలను కార్పొరేట్లకు దోచుపెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రెడ్డి వేణు, జి.వెంకటరమణ, ఎం.తిరుపతిరావు, బంటు దాసు, రాము, సూరిబాబు, మన్మథరావు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం



బ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

పార్వతీపురం టౌన్: కాలజ్ఞానబ్రహ్మ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమాంబ అమ్మవార్ల కల్యాణ మహోత్సవం పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో జరిగింది. శుక్రవారం పట్టణంలోని ప్రధాన రహదారిలో గల కంగటివారి కూడలివద్ద గల బ్రహ్మంగారి విగ్రహం వద్ద రుత్వికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నెయ్యిలవీధిలో గల కల్యాణ మండపం వరకు వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ ఉత్సవ విగ్రహాలను మేళతాళాల మధ్య ఊరేగించారు. సాయంత్రం ఆరునుంచి బ్రహ్మేంద్రస్వామి,గోవింద మాంబ అమ్మవార్ల కల్యాణ మహోత్సవం జరిగింది. మధ్యాహ్నం కల్యాణ వేదిక వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పాలకొండలో పోలీసుల కవాతు



కురుపాం రూరల్: మొండెంఖల్‌లో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

పాలకొండ: పట్టణంలో రానున్న సార్వత్రిక ఎన్నికలు దృష్ట్యా పోలీసులు కవాతును శుక్రవారం నిర్వహించారు. పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావు, సీఐ చంద్రమౌళి, ఎస్ఐ ప్రశాంత్‌కుమార్, వివిధ దళాల సిబ్బంది కవాతును చేపట్టారు. రానున్న ఎన్నికల్లో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు.● **కురుపాం రూరల్:** రానున్న ఎన్నికల దృష్ట్యా కేంద్ర బలగాలతో శుక్రవారం మొండెంఖల్‌లోఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ, నీలకంఠాపురం ఎస్ఐ నీలకంఠరావు ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు.

నిరుద్యోగులకు శిక్షణ ప్రారంభం



వైటీసీలో శిక్షణలో పాల్గొన్న యువత

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం యూత్ శిక్షణకేంద్రంలో ఉపాధి అవకాశాలపై గిరిజన నిరుద్యోగ యువతకు శిక్షణ శుక్రవారం ప్రారంభించారు. వైటీసీ కేంద్రంలో మూడు బ్యాచ్‌లు కోర్సులను ప్రారం భించినట్లు వైటీసీ ఇన్‌చార్జి రాము, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సాయికుమార్ తెలిపారు. ఇక్కడ శిక్షణలు పూర్తి చేసి సర్టిఫికెట్లు మంజూరు చేస్తామని ఐటీడీఏ పథక నిర్వహణ అధికారి విష్ణుచరణ్ తెలిపారు. నిరుద్యోగ గిరిజన యువత కోర్సులను సక్రమంగా పూర్తి చేసి ప్రభుత్వం కల్పిస్తున్న ఉద్యోగాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'జయకృష్ణకే అవకాశం ఇవ్వాలి'

పాలకొండ: టీడీపీ పాలకొండ నియోజకవర్గ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణకే టిక్కెట్ అవకాశం కల్పించాలని ఆ పార్టీ పాలకొండ పట్టణ, మండల నాయకులు కోరారు.శుక్రవారం పాలకొండలో విలేకరులతో మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు పార్టీ ఇచ్చిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని జయకృష్ణ బలపరిచారని గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం అవినీతిపై నిరంతరాయంగా జయకృష్ణ పోరాడారని తెలిపారు. ●**భామిని:** పాలకొండ నియోజకవర్గంలో టీడీపీకి నిరంతరం సేవలందిస్తున్న జయకృష్ణకు అధిష్టానం టిక్కెట్ ఇవ్వాలని ఆ పార్టీ నాయకులు కోరారు. శుక్రవారం భామినిలో మండల స్థాయి టీడీపీ నాయకులు సమావేశం నిర్వహించారు.●**వీరఘట్టం**: జయకృష్ణకే టికెట్ ఇవ్వాలని టీడీపీ మండలాధ్యక్షుడు ఉదయాన ఉదయ్‌భాస్కర్ కోరారు.వీరఘట్టంలో విలేకరులతో మాట్లాడుతూ పాలకొండలో భారీ మెజార్టీతో గెలిపిస్తామని, అందుకు నిరంతరం కృషిచేశామన్నారు. ● **సీతంపేట:** పాలకొండ నియోజకవర్గంలో జయకృష్ణకు అండగా కార్యకర్తలంతా అండగా ఉన్నామని టీడీపీ మండలాధ్యక్షుడు సవర తోటముఖలింగం తెలిపారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ హిమరిక పవన్, బీసీసెల్‌అధ్యక్షుడు రత్నాల రంగనాథం, ఎస్సీసెల్ అధ్యక్షుడు గంటా సుధ, మహాశక్తి ప్రచార కార్యకర్త సువర్ణ, సంధ్యారాణి, క్లస్టర్ ఇన్‌చార్జి సుబ్బారావు, చంద్రశేఖర్, యూనిట్ ఇన్‌చార్జి సోమునాయుడు పాల్గొన్నారు.

నేడు రావివలసలో సాయి శతరుద్రమం

గరుగుబిల్లి: మండలంలోని రావివలసలో శనివారం శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో 74వ నమామి సాయి శత రుద్రమం నిర్వహించనున్నట్లు ఆ సమితి జిల్లా అధ్యక్షుడు పల్ల నేతాజీనాయుడు ఒక ప్రకనటలో తెలిపారు. కార్యక్రమానికి సత్యసాయి సేవాసంస్థల రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ కె.సాయి శ్రీహరి ప్రసాద్‌వర్మ, 120మంది వేద పండితులు హాజరవుతున్నారని పేర్కొన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

సీతంపేట: సీతంపేట గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల (బాలురు), పెద్దమడి గురుకుల పాఠశాలలో (బాలికలు) 2024-25 విద్యా సంవత్సరానికి 5, 6,7,8,9 తరగతుల్లో బ్యాగ్‌లాగ్ సీట్లకు అంగ్లమాధ్యమం ప్రవేశం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో కల్పనాకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు నేరుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఏపీటీడబ్ల్యూజీయూ ఆర్‌యూకే యూ ఎల్‌ఏఎం.ఏపి.జీవోవీ.ఇన్‌లో సమర్పించాలని పేర్కొన్నారు. ప్రవేశపరీక్షలో మెరిట్ మార్కులు ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి బ్యాక్‌లాగ్ సీట్లకు గిరిజనులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో ఏప్రిల్ పదోతేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 21వ తేదీన ప్రవేశ పరీక్ష జరుగుతుందని తెలిపారు.

సంక్షేమాన్ని విస్మరించిన వైసీపీ

● తెలుగుదేశం పార్టీ నాయకులు ధ్వజం

వైసీపీ ప్రభుత్వ హయాం ప్రజల సంక్షేమాన్ని విస్మరించిందని టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. శుక్రవారం జిల్లాలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. పార్వతీపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మసీదును సందర్శించారు.

ముస్లింల సంక్షేమానికి ప్రాధాన్యం..

బెలగాం: ముస్లిము మైనార్టీల సంక్షేమాన్ని వైసీపీ ప్రభుత్వం అటకెక్కించిందని పార్వతీపురం నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయచంద్ర ఆరోపించారు. టీడీపీలో ముస్లిముల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తుందని తెలిపారు. శుక్రవారం పార్వతీపురంలోని బంగారమ్మ కాలనీలో ఉన్న మసీదును సందర్శించారు. ఈ సందర్భంగా విజయచంద్ర మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పార్వతీపురంలోని ముస్లిముల సంక్షేమానికి ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. షాదీఖానా నిర్మాణం, ఆర్థికంగా ఎదుగుదల కోసం పథకాలు అమలు చేస్తామన్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ముస్లిముల కోసం పెట్టిన అనేక సంక్షేమాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసి, వారికి అన్యాయం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి.సత్యనారాయణ, సింహాచలం నాయుడు, శ్రీరాములు, మధు, గుంట్రెడ్డి రవి, జనసేన నాయకులు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: లఖనాపురంలో పథకాలపై ప్రచారం నిర్వహిస్తున్న విజయవాంకుశం

టీడీపీతోనే సంక్షేమం సాధ్యం..

గరుగుబిల్లి: ప్రజలు ఆర్థికంగా ఉండేందుకు సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అందించేది తెలుగుదేశం పార్టీయేనని ఆ పార్టీ అరకు నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి ముదిలిబాబు విజయవాంకుశం తెలిపారు. మండలంలోని లఖనాపురం, గదబవలసల్లో పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పాలనలో ప్రజలు పూర్తిగా విసుగు చెందారన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీలు అధికారంలోకి రావడం తథ్యమన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన పథకాలతో ప్రజలు ఆకర్షితులవుతున్నారన్నారు.



కురుపాం రూరల్: ఒబ్బంగిలో ప్రతిజ్ఞ చేస్తున్న టీడీపీ శ్రేణులు

ఒబ్బంగిలో టీడీపీ శ్రేణుల ప్రతిజ్ఞ..

కురుపాం రూరల్: కురుపాం నియోజకవర్గంనుంచి పోటీచేస్తున్న తోయక జగదీశ్వరిని గెలిపించి అధికారంలోని తీసుకువస్తామని ఆ పార్టీ కార్యకర్తలు, గృహ సారధులు తెలిపారు.ఈ మేరకు శుక్రవారం ఒబ్బంగి, ఊసకొండ గ్రామాల్లో ప్రతిజ్ఞ చేశారు.

సమాజంలో మహిళల పాత్ర కీలకం

● ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



పార్వతీపురంలో మహిళను సన్మానిస్తున్న విజయచంద్ర

నేటి ఆధునిక సమాజంలో మహిళల పాత్ర కీలకమని వక్తలు తెలిపారు. శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లోని మహిళలను సన్మానించారు. వివిధ రకాల పోటీల్లో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు.

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: మహిళలంటే మహాశక్తి అని టీడీపీ-జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థి బోనెల విజయచంద్ర తెలిపారు. శుక్రవారం పార్వతీపురం నియోజకవర్గం తెలుగుదేశం కార్యాలయంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు సన్మానించారు. అనంతరం విజయచంద్ర మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృది చెందాలని కోరారు. తెలుగుదేశం ప్రభుత్వ కాలంలో మహిళలకు అనేక సంక్షేమ పథకాలతో పాట మహిళా సంఘాలను ఏర్పాటు చేసిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. వైసీపీ పాలనలో మహిళలకు గౌరవం దక్కని పరిస్థితి నెలకొందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొట్టాపు వెంకట్‌నాయుడు, బార్నాల సీతారాం, బోనుదేవి చంద్రమౌళి, పి.సత్యనారాయణ, మజ్జి వెంకటేష్, పాలకొండ రాజశేఖర్, గురజాన చంద్రమౌళి, కోట మధుసూదనరావు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్: మహిళలు మహారాణులని మార్నింగ్ స్టార్ వాకర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు వి.చిన్న తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో అంతర్జా తీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని పలు రంగాలకు చెందిన మహిళాలను క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నోబుల్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యం నాయుడు, మార్నింగ్ స్టార్ వాకర్స్ క్లబ్ కార్యదర్శి ఉమ, గౌరవ సభ్యులు ఎం రవికుమార్, కె.నాగు, సభ్యులు పి. సోమేశ్వరరావు, శుభలేఖ శ్రీను, ఎం. శ్రీను, పి. స్వామి, పి.మార్కేండేయులు పాల్గొన్నారు.

బెలగాం: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని ఏఆర్ఏఎస్‌డబ్ల్యూఏ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ దయామని తెలిపారు. పార్వతీపురంలోని జిల్లా ఆసుపత్రిలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గర్భిణులు, వైద్య ఆరోగ్య సిబ్బందికి అభినందించారు.

పాలకొండ: స్త్రీ జన్మ ఎంతో విలువైనదని గైనకాలజిస్ట్ రౌతు భారతి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్మెంట్‌సెల్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు అధ్యక్షతన మహిళా దినోత్సవం జరిగింది. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జయమణి, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ బి.రాజు, అధ్యాపకులు శాంతి, పి.రాజ్యలక్ష్మీ, సిహెచ్‌ఎం.ఎస్.కుమారి, ఎం.ప్రశాంతి, డాక్టర్ కె.శ్రీనివాసరావు, కె.రాఘవేంద్రనాయుడు, ఆమంచి శ్రీనివాసరావు, జగన్మోహన్‌రావు, తిరుపతిరావు, జనార్ధనరావు పాల్గొన్నారు.



పాలకొండ: డాక్టర్ భారతితో పాటు అధ్యాపకులను సన్మానిస్తున్న దృశ్యం

సాలూరు: మక్కువ మండలంలోని దుగ్గేరు గ్రామం ఆదివాసీ భవన్ వద్ద స్త్రీ విముక్తి సంఘటన ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు అమ్మాజీ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దోపిడీ, అణచివేతలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలన్నారు కార్య క్రమంలో స్త్రీ విముక్తి సంఘటన నాయకులు జయసుధ, అమ్మడమ్మ తదితరులు పాల్గొన్నారు.

కురుపాం రూరల్: నేరేడువలసలో యస్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి షేక్ గౌష్ ఆధ్వర్యంలో మహిళాదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాధ్యక్షురాలు శెట్టి పద్మావతి మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు వివరించారు. కార్యక్రమంలో కురుపాం సర్పంచ్ గార్ల సుజాత, జడ్పీటీసీ సభ్యురాలు గొర్లి సుజాత, ఎంపీటీసీలు తిమ్మక సునీత పాల్గొన్నారు.

హరోం.. హర

● తెల్లవారుజాము నుంచేశివాలయాలకు పోటెత్తిన భక్తులు ●నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు



గుమ్మలక్ష్మీపురం: శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జిల్లాలో మహాశివరాత్రిని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా నిర్వాహకులు భక్తులకు ఇబ్బందులకు గురికాకుండా ప్రత్యేక ఏర్పాట్లుచేశారు.

● **పార్వతీపురం టౌన్:** పార్వతీపురంలో పలు శైవక్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఉదయం నాలుగు గంటల నుంచి ప్రధాన రహదారిలో గల ఉమామార్కేండేయ స్వామి, దుర్గాదేవి రహదారిలో గల కంగటివారి శివాలయం, అగ్రహారం ఈశాన్యేశ్వర, కొత్తవలస శ్రీకాశీ విశ్వేశ్వరాలయాల్లో శివలింగాలకు ప్రత్యేకాభిషేకాలు నిర్వహించారు. లోకశాంతి కోసం మహాశివునికి ప్రత్యేక హోమాలు భక్తులు చేసారు.

●**పాలకొండ:** పట్టణంలో శ్రీకాశీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి, రామలింగేశ్వరస్వామి, సదాశివుడు, సనారీశ్వరాలయంతో పాటు కొండాపురం, తంపటాపల్లి, తుమరాడ, వెలగవాడ, కోటిపల్లి ఆలయాలకుజనం పోటెత్తారు. పాలకొండలోని ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న శ్రీకాశీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు జోస్యులు కూర్మనాథశర్మ, ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో కుంకుమపూజలు నిర్వహించారు. పాలకొండలోని కోమటిపేటలో సనారీ విశ్వేశ్వరస్వామికి డీఎస్పీ కృష్ణారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకోటదుర్గమ్మ ఆలయంలో శుక్రవారం ఉదయం ఆరు గంటలకు ప్రారంభమైన భజన శనివారం ఉదయం ఆరుగంటల వరకు 24 గంటల జరగనుంది. ఆలయ ప్రాంగణంలో దేవదాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. రుద్రిపేట, వడమ, బెజ్జి, తుమరాడ, లుంబూరు గ్రామాలకు చెందిన భజన బృందం సభ్యులు పాల్గొన్నారు. పాలకొండ నక్కలపేటలోఉన్న షిర్డీసాయి ఆలయంలో ఉన్న మరకత లింగానికి భక్తులు పూజలు నిర్వహించారు.

●**సాలూరు:**మక్కువలోని భ్రమరాంబసహిత మల్లికార్జున స్వామి,శాంతేశ్వరం,ఉమారామలింగేశ్వరస్వామి, ములక్యావలస, శ్రీకాశీ విశ్వేశ్వరాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు.

● **గరుగుబిల్లి:** గొట్టివలసలో శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంతో పాటు శివ్వాం, నాగూరు,ఉల్లిభద్ర, రావివలస, బీవీపురం, రావుపల్లి, తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీవీ పురంలో వీరఘట్టానికి చెందిన పలు దేవాలయాల ప్రతిష్టాపకులు బ్రహ్మశ్రీ ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ పర్యవేక్షణలో కల్యాణం నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఉండేలా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

● **భామిని:** మండలంలోని పెద్దదిమిలి ఎండల మల్లికార్జునస్వామి, ఘనసర, బాలేరు, భామిని, పక్కుడిభద్ర, బత్తిలి, నేరడి తదితర గ్రామాల్లో భక్తులు కిటకిటలాడాయారు. పెద్దదిమిలిఆలయానికి మండలంతో పాటు కొత్తూరు, సీతంపేట, ఒడిశా కాశీనగరం నుంచి భక్తులు చేరుకున్నారు.

●**వీరఘట్టం**:వీరఘట్టంలోని ఉమామహేశ్వరాలయంలో, కిమ్మి నాగావళి నదీతీరంలోగల ఉమారామలింగేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు. మధ్యా హ్నం అన్నదాన కార్య క్రమం చేపట్టారు.

●**సాలూరు రూరల్:** సాలూరులోని పంచముఖేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో అఖండజ్యోతి వెలిగించారు.వాసవీ కన్యకాపర మేశ్వరి ఆలయంలో నగేశ్వరస్వామికి, కామాక్షి ఆలయంలో ఏకామ్రనాథ్, వేంక టేశ్వర కాలనీలో ఉమారామలింగేశ్వర ఆలయంలో పూజలుచేశారు. కొట్టక్కి భీమలింగేశ్వరస్వామి ఆలయానికి భక్తులుపోటెత్తారు. సాలూరులో సంతోషిమాత శివరాత్రి సందర్భంగా ప్రత్యేక అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. స్వయంభూ లింగంగా భక్తులు భావిస్తారు. ఈ లింగదర్శనానికి వేకువజాము నుంచే భక్తులు పోటెత్తారు. భీమలింగేశ్వరునికి ద్విజుడు మేడూరు విజయకృష్ణ ప్రత్యేక పూజలు చేశారు.శివరాంపురం పురాతన శివాలయంలో శివునికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. రొంపల్లి, చినపారన్నవలస, బోరబంద తదితర గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.మామిడిపల్లిల్లో శివాలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



సాలూరు రూరల్: పంచముఖేశ్వరాలయంలో ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు

గుహాలయానికి పోటెత్తిన భక్తులు

సాలూరుకు 27 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒడిశాలోని సుంకి పక్కన గల పెదపాడు గుహాలయానికి శివరాత్రి సందర్భంగా శుక్రవారం ఇరు రాష్ట్రాల భక్తులు పోటెత్తారు. ఏటా శివరాత్రి పురస్కరించుకుని గిరిజనులు శివోత్సవాన్ని నిర్వహిస్తారు. పెదపాడు గ్రామ శివారున కొండ గుహలో శివలింగంతో పాటు పాతాళేశ్వరి, వనదేవి, పార్వతిదేవి, భైరవ విగ్రహాలు ఉన్నాయి. గుహలో ఇరుకైన ఇనుపమెట్లను ఎక్కి శివలింగాన్ని భక్తులు దర్శించారు. భక్తులు జాగరణ చేయడానికి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అలాగే ఏవోబీలో భైపరిగుడ సమీపాన గల గుప్తేశ్వర్ గుహాలయానికి భక్తులు పోటెత్తారు. ఈ గుహాలయంలో ఉన్న భారీ శివలింగం ప్రతి ఏటా పెరుగుతుందని భక్తులు నమ్మకం.

● **సీతానగరం:** బలిజిపేట మండలంలోని నారాయణపురం శివాలయం భక్తులు కిటకిటలాడింది. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు సువర్ణముఖి నదిలో స్నానం చేసుకుని శివుని దర్శించుకున్నారు.

ఒడిశా

కిటకిటలాడిన శివాలయాలు

రాయగడ: జిల్లాలోని అన్ని శివాలయాలు మహాశివరాత్రి పురస్కరించు కుని శుక్రవారం కిటకిటలాడియి. తెల్లవారుజామున మూడు గంటలకే భక్తులు ఆలయాల్లో బారులుతీరారు. రాయగడలోని స్వయంభూ శివుడు బాలంకేశ్వర ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. పితా మహల్ జాడేశ్వరాలయానికి భక్తుల రద్దీకి అనుగుణంగా నిర్వాహకులు ఏర్పాట్లుచేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో పలు సంఘాల ప్రతినిధులు మజ్జిగ, మంచినీరు అందజేశారు. పోలీసులు బందోబస్తును ఏర్పాటుచేశారు.



రాయగడలోని శివాలయం వద్ద బారులుతీరిన భక్తులు

ఆరోగ్య సిబ్బందిని నియమించాలి

● *గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి*

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: గిరిజన ఆశ్రమ పాఠశాలలు, కళాశాల వసతిగృహాలకు ప్రత్యేకంగా గతంలో పనిచేసిన ఆదివాసీ ఆరోగ్య సిబ్బందిని నియమించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. ఇప్పటికే గిరిజనులకు వైద్యసేవలు అందించేందుకు పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్ల పరిధిలో నియమితులైన ఏఎన్‌ఎంలను గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో విధులు నిర్వహించే విధంగా సర్దుబాటు చేయడం సరైన పద్ధతికాదని తెలిపారు. సర్దుబాటు చేయడం వల్ల గిరిజన ప్రాంతాల్లో అంతంత మాత్రంగానే ఉన్న ప్రభుత్వ వైద్య సేవలు మరింత అధ్వాన్నంగా తయారవుతా యని ఆందోళన వ్యక్తంచేశారు. గిరిజన మోడల్ స్కూల్, ఏపీ గిరిజన, సాంఘిక, వెనుకబడిన, కస్తూర్బా, జ్యోతీరావు పూలే విద్యా సంస్థల మాదిరిగా గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాలకు ఏఎన్‌ఎంలను నియమించాలని రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు.

గుమడ సర్పంచ్ మృతి

కొమరాడ: గుమడ సర్పంచ్ దేవుపల్లి కళావతి శుక్రవారం మృతి చెందారు. ఆమె కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు బంధువులు తెలిపారు. ఆమె మృతితో గుమడలో విషాద ఛాయలు అలముకున్నారు. ఈ మేరకు కళావతి మృతి పట్ల పలువురు సంతాపాన్ని వ్యక్తం చేశారు.

రేపు గురుకుల ప్రవేశపరీక్ష

నెల్లిమర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఐదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు సంబంధించి ఆదివారం పరీక్షలు జరుగుతాయని కళాశాల ప్రిన్సిపాల్ కె.ఉషారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఐదో తరగతి ప్రవేశ పరీక్ష, మధ్యాహ్నం రెండు నుంచి 4.30 గంటల వరకు ఇంటర్ ప్రవేశ పరీక్ష జరుగుతుందని పేర్కొన్నారు. అభ్యర్థులు హాల్ టిక్కెట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. పరీక్షా కేంద్రానికి గంట ముందుగా చేరుకోవాలని, హాల్ టిక్కెట్‌తో పాటు ఆధార్ జెరాక్స్, బబ్లింగ్ కోసం బాల్ పాయింట్ పెన్ తీసుకురావాలని తెలిపారు. ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబోమని, ఈ విషయాన్ని అభ్యర్థులు గమనించాలని ప్రిన్సిపాల్ ఉషారాణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కొత్తపాలెంలో కృష్ణమ్మతల్లి మహోత్సవాలు

బొండపల్లి: మండలంలోని కొత్తపాలెంలో మాజీ వైస్ ఎంపీపీ బోడ్డురాము, సత్యవతి ఆధ్వర్యంలో కృష్ణమ్మతల్లి మహోత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా కోలాటం, చెక్క భజనలతోపాటు ఆలయ ఆవరణంలో సమారాధన ఏర్పాటుచేశారు. సాయంత్రం జిల్లాస్థాయి ఎడ్లబండ్ల పోటీలతో పాటు గుర్రపు పందాలు, వాలీబాల్, సింగిడిరాళ్ల పోటీలను నిర్వహించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు పది, ఆరు, నాలుగు, వేల రూపాయలు గజపతినగరం తెలుగుదేశం పార్టీ అభ్యర్థి కొండపల్లి శ్రీనివాసరావు, లోక్‌సత్తా రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ, గాదె శ్రీనివాసరావు అందజేశారు. సాయత్రం ఏర్పాటు చేసిన రేలార జానపద పాటలతో పాటు, సినీ సంగీత విభావరి ఆకట్టుకున్నాయి.